క్లుప్తంగా

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు



గొల్లప్రోలు ఎరువుల దుకాణంలో తనిఖీలు చేస్తున్న అధికారులు

పిఠాపురం: గొల్లప్రోలులోని ఎరువుల దుకాణాలపై గురువారం అధికారులు దాడులు నిర్వహించారు. దుకాణాల్లోని పురుగు మందులు, ఎరువులు, విత్తనాలను తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్, బిల్ బుక్కుల్లో వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించారు. రికార్డుల్లో తేడాలు ఉన్న దుకాణాల లైసెన్స్‌లు తాత్కాలికంగా రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు. మిగిలిన షాపులను కూడా తనిఖీలు చేస్తామన్నారు. ఈ తనిఖీల్లో టెక్నికల్ వ్యవసాయ అధికారులు గాయత్రి దేవి, విజయలక్ష్మి, పిఠాపురం సహాయ వ్యవసాయ సంచాలకులు స్వాతి, మండల వ్యవసాయ అధికారి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించాలి



నవరలో రైతులకు సూచనలు ఇస్తున్న ఏడీఏ, ఏఓలు

సామర్లకోట: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తుపాన్‌గా మారే ప్రమాదం ఉందని వాతావరణ శాఖ సూచనల మేరకు ధాన్యం రాశులను సురక్షిత ప్రాంతాలకు తరలించుకోవాలని ఆ శాఖ ఏడీఏ ఎం.రత్నప్రశాంతి సూచించారు. ఈ మేరకు గురువారం మండలంలోని వివిధ గ్రామాల్లో రైతులను కలసి సూచనలు ఇచ్చారు. పంట కోత కోయాల్సిన రైతులు కోత వాయిదా వేసుకోవాలన్నారు. ఇప్పటికే కోతలు పూర్తి చేసిన వారు ధాన్యాన్ని పొలాల్లోని కళ్లాల్లో ఉంచకుండా సురక్షిత ప్రదేశాలకు తరలించుకోవాలన్నారు. అదే విధంగా కోతలు కోసి కుప్పలు వేసిన రైతులు కుప్పలపై టార్పాలిన్లు వేసుకోవాలన్నారు. పల్లపు ప్రాంతాల్లో ఉన్న పంటను ఎత్తయిన ప్రాంతాలకు తరలించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఐ.సత్య, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా గౌరీశంకరుల ఊరేగింపు



కొమరగిరిలో గౌరీదేవి, నందీశ్వరుని ఊరేగిస్తున్న భక్తులు

కొత్తపల్లి: మండలంలోని కొమరగిరిలో గౌరీ శంకరుల ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం మేళతాళాలు, బాణసంచా కాల్పుల నడుమ స్వామి, అమ్మవార్లను వైభవంగా ఊరేగించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, శక్తివేషాలు భక్తులను ఆకట్టుకున్నాయి. అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

బాల్య వివాహాలు చేయొద్దు

బోట్‌క్లబ్: బాల్య వివాహాలు చేయడం నేరమని ఐసీడీఎస్ పీడీ ప్రవీణ అన్నారు. స్థానిక గాంధీనగర్‌లోని ఐసీడీఎస్ కార్యాలయంలో ఈ నెల 28 నుంచి డిసెంబర్ వరకూ నిర్వహించే బాల్య వివాహ ముక్త భారత్ కార్యక్రమాన్ని గురువారం ఆమె ప్రారంభించారు. చిన్న వయసులో ఆడపిల్లలకు పెళ్లి చేయడంతో తల్లితోపాటు పుట్టే బిడ్డకు అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని తల్లిదండ్రులు పిల్లలకు తగిన వయసు వచ్చిన తర్వాత వివాహం చేయాలన్నారు. చైల్డ్‌రైట్స్ అడ్వకసి ఫౌండేషన్ కో ఆర్డినేటర్ స్వర్ణలత మాట్లాడుతూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కాకినాడ జిల్లాలో ఐదు మండలాల్లో 50 గ్రామాల్లో ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు బాల్య వివాహ ముక్త భారత్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం ఫౌండేషన్ ముద్రించిన అవగాహన కరపత్రాలను ఆమె ఆవిష్కరించారు.

సామర్లకోట అధికారుల ఫోన్ నంబర్లు

మున్సిపాలిటీ	
మున్సిపల్ కమిషనర్	98499 05808
మున్సిపల్ మేనేజర్	98499 07118
మున్సిపల్ డీఈ	96769 68282
మున్సిపల్ ఏఈ	98499 07122
మున్సిపల్ ఆర్వో	98499 07120
మున్సిపల్ ఆర్ఐ	90146 00920
మున్సిపల్ టీపీఓ	98499 07123
శానిటరీ ఇన్‌స్పెక్టర్	77024 48282
అకౌంట్స్ ఆఫీసర్	98499 02447
ప్రభుత్వాస్పత్రి	
సూపరింటెండెంట్	80082 88125
పశు సంవర్ధక శాఖ ఏడీ	94418 60299
తహసీల్దార్	98499 03876
ఎంఈఓ-1	85558 71069
ఎంఈఓ-2	94410 73418

అమ్మో చలి.. పులి

- ఉన్ని దుస్తులకు డిమాండ్
- నియోజకవర్గంలో దుకాణాల ఏర్పాటు



సామర్లకోటలో ఉన్ని దుస్తుల దుకాణం

సామర్లకోట: చలి వణికిస్తోంది.. ఎన్నడూ లేనంతగా గజగజలాడిస్తోంది.. చిన్నా పెద్దా అనే తేడా లేకుండా అందరినీ హడలెత్తిస్తోంది.. దీపావళి వెళ్లిన తరువాత నుంచి చలి పెరిగింది.. ఈ నేపథ్యంలో ఉన్ని దుస్తులు విక్రయించే దుకాణాలు వెలుస్తున్నాయి. సామర్లకోట– పెద్దాపురం రోడ్డులో రెండు ఉన్ని దుకాణాలు ఏర్పాటు చేయగా, పెద్దాపురం మున్సిపాలిటీ పరిధిలో రెండు దుకాణాలు ఏర్పాటు చేశారు. రాజస్థాన్‌కు చెందిన వ్యాపారస్తులు ఉన్ని దుస్తులు విక్రయిస్తున్నారు. ఇక్కడ రూ.100 నుంచి రూ.ఐదు వేల వరకూ విలువ కలిగిన దుస్తులు విక్రయిస్తున్నారు. స్వెటర్లతో పాటు, ఉన్ని దుప్పట్లు, మంకీ క్యాప్‌లు రకరకాల రంగుల్లో ప్రజలను ఆకర్షించే రీతిలో ఉండేవి విక్రయాలు జరుపుతున్నారు. సుమారు పదేళ్ల నుంచి చలికాలంలో రోడ్డు మార్జిన్‌లో ఉన్ని దుస్తులు విక్రయిస్తున్నామని, ప్రస్తుతం అమ్మకాలు అంతంత మాత్రంగానే ఉన్నారని వ్యాపారులు అంటున్నారు. డిసెంబర్ నెల నుంచి అమ్మకాలు పెరిగే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

- చలి గాలిలో ఎక్కువగా తిరిగితే రోగాల బారిన పడే అవకాశం ఉంది. చలికి రక్తనాళాలు కుచించుపోతాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని చలిలో ఎక్కువగా తిరగకపోవడం మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. చలి గాలి నుంచి రక్షణ పొందడానికి ఉన్ని దుస్తులను వాడాలని అంటున్నారు. శరీరంలోని వేడి బయటకు వెళ్లకుండా ఉండేందుకు ఉన్ని దుస్తులు ఉపయుక్తంగా ఉంటాయి. తలకు టోపీలు, స్వెటర్లు వేసుకుని బయటకు వెళ్లేవారు చలి నుంచి రక్షణ పొందడానికి అవకాశం ఉంటుంది. డిసెంబర్ నుంచి చలి మరింత పెరిగే అవకాశం ఉంటుంది.

తెల్లవారుజాము నుంచే..

ప్రతి రోజూ తెల్లవారు జామున చలి గాలితో పాటు మంచు కురుస్తోంది. దాంతో రాత్రి, తెల్లవారు జామున రోడ్లపై ఎటువంటి రక్షణ లేకుండా తిరిగితే జలుబు, దగ్గు వ్యాధులకు గురవుతారని వైద్యులు తెలియజేస్తున్నారు. గతంలో శరీరంలో ఉష్ణం పెంచుకోవడానికి తెల్లవారు జామునే గడ్డితో చలి మంటలు కాగేవారు. అయితే ఆ గడ్డి కొరతతో మంటలు వేసేవారు కూడా కనిపించడం లేదు. ఇదిలా ఉంటే పొగ మంచు కారణంగా రోడ్డుపై వచ్చే వాహనాలు కనిపించక ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఏదేమైనా ఈ సమయంలో జాగ్రత్తగా వెళ్లాలని పోలీసులు సూచిస్తున్నారు.

ఎన్నడూ లేని విధంగా..



గతంలో ఎన్నడూ లేని విధంగా నవంబర్ నెల నుంచే చలి ప్రారంభమైంది. కార్తిక మాసంలో గోదావరి కాలువలో, ఇంటి వద్ద చన్నీళ్లతో స్నానం చేసేవారం. అయితే చలి పెరిగిపోవడంతో తెల్లవారు జామున స్నానాలు చేయలేకపోతున్నాం. డిసెంబరు, జనవరిలో చలి మరింత ఎక్కువగా ఉంటుంది. చలిని తట్టుకోవడానికి ఉన్ని దుస్తులు ఉపయోగిస్తున్నాం.

–తోటకూర గంగాధర్, జాతీయ పర్యావరణ మిత్ర, సామర్లకోట

చలిలో తిరగడం మంచిది కాదు



శీతాకాలంలో చలిలో ఎక్కువగా తిరగడం అంత మంచిది కాదు. తప్పనిసరి పరిస్థితిలో చలి గాలిలో తిరిగే సమయంలో ఉన్ని స్వెటర్లు ధరించాలి. చెవుల్లోకి చలి గాలి వెళ్లకుండా జాగ్రత్త పడాలి. గోరువెచ్చని నీళ్లతో స్నానం చేయాలి. చలిలో తిరిగిన సమయంలో జలుబు వచ్చి అనారోగ్యానికి గురైతే వెంటనే వైద్యులను సంప్రదించాలి.

–మహోన్నత్, వైద్యుడు, సామర్లకోట

పాదగయ క్షేత్రాన్ని దర్శించిన విధుశేఖర భారతీ మహాస్వామి



విధుశేఖర భారతీ మహాస్వామిజీకి అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో జగన్మోహన్ శ్రీనివాస్

కొత్తపల్లి: శృంగేరి పీఠం ఉత్తరాధికారి జగద్గురు విధుశేఖర భారతీ మహాస్వామి గురువారం పిఠాపురం పాదగయ క్షేత్రాన్ని సందర్శించారు. పాదగయ క్షేత్రంలో ఆయనకు ఘనస్వాగతం పలికారు. ఆలయంలో కుక్కుటేశ్వరస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవారు, దత్తాత్రేయ స్వామి వార్లను ఆయన దర్శించుకున్నారు. అనంతరం స్వామీజీకి దేవదాయ శాఖ సహాయ కమిషనర్, ఈవో జగన్మోహన్ శ్రీనివాసు పురుహూతికా అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు.

నేడు కౌన్సిల్ సమావేశం

సామర్లకోట: స్థానిక మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం శుక్రవారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అధ్యక్షతన జరుగుతుందని కమిషనర్ ఎ.శ్రీవిద్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని అత్యవసర పనులకు కౌన్సిల్ అభిప్రాయ సేకరణ కోసం అజెండాలో ఐదు అంశాలను పొందుపర్చామన్నారు. ఈ మేరకు కౌన్సిల్ సభ్యులు, ఆయా శాఖలకు చెందిన అధికారులు సమావేశానికి హాజరు కావాలన్నారు.

షష్ఠి ఉత్సవాలకు ఏర్పాట్లు



చదలాడలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి



ఆలయం వద్ద చలువ పందిరి ఏర్పాటు

పెద్దాపురం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన పెద్దాపురం మండలం చదలాడ సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి షష్ఠి ఉత్సవాలకు ఆలయ కమిటీ ఏర్పాట్లను ముమ్మరం చేసింది. వచ్చే నెల 3వ తేదీ నుంచి 7వ తేదీ వరకూ ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేస్తోంది. సోమవారం ఆలయం వద్ద చలువ పందిర్లను వేశారు. ఐదు రోజుల పాటు నిర్వహించే ఉత్సవాల్లో భాగంగా ఆలయాన్నీ విద్యుత్ దీపాలతో అలంకరిస్తున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా స్వామివారి దర్శన భాగ్యం కలిగించే విధంగా ఆలయ కమిటీ అన్ని చర్యలు చేపట్టింది. షష్ఠి రోజు 7న వేకువజాము నుంచి స్వామివారి దర్శన భాగ్యం కల్పించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 11 గంటలకు స్వామివారి ఊరేగింపు, రాత్రి భారీ బాణసంచా కాల్పులు ఉంటాయన్నారు. భక్తులు హాజరై స్వామివారి కృపకు పాత్రులు కావాలని విజ్ఞప్తి చేశారు.

పంచారామ క్షేత్రంలో ప్రత్యేక పూజలు



సామర్లకోట పంచారామ క్షేత్రంలో స్వామివారు



బాలాత్రిపుర సుందరి అమ్మవారు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రం బాలాత్రిపుర సుందరీ సమేత కుమారారామ భీమేశ్వర స్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు జరిగాయి. కార్తిక మాసాన్ని పురస్కరించుకుని ఆలయంలో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా తెల్లవారు జాము నుంచే ఆలయానికి భారీగా భక్తులు తరలివచ్చారు. ఆలయంలో గోపూజ, స్వామివారికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలతో పాటు ఉప ఆలయాల్లో అర్చకులు పూజలు చేశారు. స్వామివారి తొలి అభిషేకాన్ని తిలకించడానికి ప్రాంగణంలో వేచి ఉన్నారు. ఆలయానికి వచ్చిన భక్తులు కాలభైరవస్వామి, ధ్వజ స్తంభం, రావి, జమ్మి, ఉసిరి చెట్లు, తులసి మొక్కల వద్ద దీపాలు వెలిగించారు. ఈఓ భళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, అల్లకి రాజ్‌గోపాల్, చెరుకూరి రాంబాబు, శ్రీకాకుళపు సత్యనారాయణ మూర్తి, వినయ్, సన్నిధిరాజు అంజిబాబు, కుమార్, భాస్కర్‌లు పూజాదికాలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఉదయం పులిహోర, మధ్యాహ్నం దేవస్థాన అన్నదాన ట్రస్టు ద్వారా అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. ఘనాపాటి శ్రీపాద రాజశేఖరశర్మ ఆధ్వర్యంలో లక్షపత్రి పూజ నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. ధ్వజస్తంభం వద్ద ఈఓ భళ్ల నీలకంఠం, ఉత్సవ కమిటీ చైర్మన్ కంటే బాబు దంపతుల ఆధ్వర్యంలో ఆకాశ దీపానికి పూజలు చేశారు.

రథయాత్రకు ఏర్పాట్లు

వచ్చే ఏడాది ఫిబ్రవరి 8న గొంచాల నుంచి భద్రాచలానికి శ్రీరామ రథంతో పాదయాత్ర బయలు దేరుతుందని గొంచాల భద్రాది సీతారామాలయం కమిటీ అధినేత, గురుస్వామి వాసుదేవ సుబ్బారావు తెలిపారు. ఈ పాదయాత్రలో పాల్గొనే వారు శ్రీరామ మాల ధరించాలన్నారు. దీని కోసం జనవరి 28న మాల ధరించి ఇంటి వద్ద 11 రోజుల పాటు దీక్ష చేయాల్సి ఉంటుందన్నారు. 12వ రోజు (ఫిబ్రవరి 8న) బయలు దేరే రథయాత్రకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. దీక్ష చేసేవారు ఆలయ కమిటీకి ఆధార్ కార్డుతో పాటు కాలి నడకన భద్రాచలం రథయాత్రకు వస్తానని హామీ పత్రం ఇవ్వాలని చెప్పారు. ఆలయ కమిటీ గుర్తించిన వారికి కర్ర, జెండా ఇస్తుందన్నారు. పాల్గొనే భక్తులు ఆలయ కమిటీ ఇచ్చే ఫొటో గుర్తింపు కార్డును ధరించి పాదయాత్రలో పాల్గొన్నాలన్నారు. ఈ పాదయాత్ర 14వ పర్యాయం గొంచాల నుంచి బయలు దేరుతుందని వాసుదేవ సుబ్బారావు చెప్పారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఆకట్టుకున్న జ్యోతిర్లింగార్చన



సామర్లకోట పంచారామ క్షేత్రంలో జ్యోతిర్లింగార్చన

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలో గురువారం రాత్రి ఏర్పాటు చేసిన జ్యోతిర్లింగార్చన ఆకట్టుకుంది. దేవస్థానానికి రూ.2,500 చెల్లించిన భక్తులకు లక్షపత్రి పూజలు చేసుకునే అవకాశం కల్పించారు. ఈ మేరకు ఆలయంలో లక్షపత్రి పూజలు చేసుకున్న భక్తులకు రసీదు ఆధారంగా ఆలయ దీపారాధన సంఘ సభ్యులు రాత్రి జ్యోతిర్లింగార్చన ఏర్పాటు చేశారు. పూజల అనంతరం జ్యోతిర్లించార్చనలో దీపాలు వెలిగించారు. లక్షపత్రి పూజలు చేసుకున్న భక్తులు వెలిగించగా మిగిలిన దీపాలను వెలిగించడానికి ఆలయానికి వచ్చిన భక్తులు పోటీ పడ్డారు. శుక్రవారం మాసశివరాత్రిని పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు ఉంటాయని ఈఓ భళ్ల నీలకంఠం తెలిపారు. డిసెంబర్ ఒకటిన అమావాస్యను పురస్కరించుకుని దీపారాధన సంఘం ఆధ్వర్యంలో మధ్యాహ్నం 10 వేల మందికి అన్నదానం ఏర్పాటు చేస్తారు. రాత్రి దీపారాధన సంఘ సభ్యుల పర్యవేక్షణలో కోటి దీపోత్సవం ఉంటుంది.

బాల్య వివాహాల నివారణపై అవగాహన కల్పించాలి



బాల్య వివాహాల నివారణపై ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

కొత్తపల్లి: బాల్య వివాహాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఐసీడీఎస్ సీడీపీఓ దుర్గాదేవి అన్నారు. గొల్లప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిశోర్ వికాసం, బాల్య వివాహల నిరోధక చట్టం, బాల్యవివాహ రహితపై సమాజంపై మండల స్థాయి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువు మధ్యలో ఆపకుండా చూడాలన్నారు. బాలికలు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. బాలికలపై లైంగిక దాడుల నివారణ, పోక్సో చట్టం, వ్యక్తిగత భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ స్వప్న, తహసీల్దార్ సత్యనారాయణ, ఐసీడీఎస్, వైద్య, పంచాయతీ, రెవెన్యూ, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి



ప్రతిజ్ఞ చేస్తున్న 23 జిల్లాల యజమానులు



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ఎలియాజర్

పెద్దాపురం: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని ప్రకృతి వ్యవసాయ ప్రతినిధి ఎలియాజర్ సూచించారు. మండలంలోని జి.రాగంపేటలో గురువారం 23 జిల్లాల ఎన్‌పీఎం దుకాణాల యజమానులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎలియాజర్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఎక్కువ శాతం రైతాంగం ప్రకృతి వ్యవసాయాన్ని చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఏటీఎం, అగ్రిడ్ మోడల్స్ చూపించి పలు మెళకువలను వివరించారు. అనంతరం ఆయా దుకాణాల యజమానులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బుంగా శేఖర్, శిక్షణ ప్రతినిధి శివచక్రం, 23 జిల్లాల ఎన్‌పీఎం షాపు యజమానులు పాల్గొన్నారు.

కొత్తపల్లి మండల గ్రామ సచివాలయ పంచాయతీ కార్యదర్శులు

కొత్తపల్లి గ్రామ సచివాలయం	ఫోన్ నెంబర్
ఉప్పాడ- 1	9951422177
ఉప్పాడ-2	6304179606
ఉప్పాడ-3	6976476445
ఉప్పాడ-4	9494464562
కొత్తపల్లి	9949470886
కొమరగిరి-1,2	9492143912
రమణక్కపేట	8185994997
శ్రీరాంపురం	8185994997
కొండెవరం-1	9492834413
కొండెవరం-2	8886384494
మూలపేట	9133666825
నాగులపల్లి-1,2	9493288248
అమీనాబాద్ -1	8555818794
అమీనాబాద్-2	8332006890
యండపల్లి-1	9949563505
యండపల్లి-2	9391545575
గోర్స	9392881512
పొన్నాడ-1	9704397769
పొన్నాడ-2	8106235468
కుతుకుడుమిల్లి	9493982629
వాకతిప్ప	9618788873
అమరవిల్లి	9059551199
కొత్తమూలపేట	9666855856
పాత, కొత్త ఇసుకపల్లి	9154403429

రేపు కాపు కార్తిక వన సమారాధన

సామర్లకోట: కార్తిక మాసాన్ని పురస్కరించుకుని ఈ నెల 30న కాపు కార్తిక వన సమారాధన ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కాపు, తెలగ, బలిజ, ఒంటరిలు ఈ వన సమారాధనకు హాజరు కావాలన్నారు. స్థానిక విస్తరణ శిక్షణా కేంద్రంలో వన సమారాధన జరుగుతుందన్నారు. వివిధ రకాల ఆటల, పాటల పోటీలు ఏర్పాటు చేశామన్నారు. ఆసక్తి కలిగిన వారు ముందుగా తమ పేర్లను నమోదు చేయించుకోవాలన్నారు. రాజకీయ పార్టీలకు అతీతంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామని నిర్వాహకులు తెలిపారు.

ఉడిపి స్వామీజీకి అపూర్వ స్వాగతం

బోట్‌క్లబ్: ఉడిపి శిరూర్ మఠాధిపతులు వేద వర్ధన తీర్థ స్వామీజీకి గురువారం స్థానిక రాఘవేంద్రస్వామి బృందావనం ప్రాంగణంలో ట్రస్ట్ సభ్యులు, భక్తులు ఘన స్వాగతం పలికారు. తొలుత స్వామీజీ రాఘవేంద్రస్వామి బృందావనానికి ప్రత్యేక హారతులు ఇచ్చారు. ఈ సందర్భంగా భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ కలియుగ కల్పవృక్షమైన రాఘవేంద్రస్వామి అనుగ్రహాన్ని అందరూ పొందాలన్నారు. హిందూ ధర్మ ప్రచారానికి అందరూ కంకణబద్ధులై ఉండాలన్నారు. ట్రస్ట్ కమిటీ కోశాధికారి వై.వెంకటేష్ ట్రస్ట్ సభ్యులను స్వామీజీకి పరిచయం చేశారు.

బలహీన వర్గాల ఆశాజ్యోతి పూలే

- వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ ఇంచార్జ్ వంగా గీత
- మహాత్మా జ్యోతిరావు పూలేకు ఘన నివాళులు



పిఠాపురంలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు



సామర్లకోటలో జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న చైర్‌పర్సన్ అరుణ, తదితరులు

కొత్తపల్లి: సమాజంలో బలహీన వర్గాలకు హక్కులు, మహిళలకు విద్యావకాశం కల్పించిన గొప్ప సంఘ సంస్కర్త జ్యోతిరావు పూలే అని మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ ఇంచార్జ్ వంగా గీత అన్నారు. పిఠాపురం పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద గురువారం మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వంగా గీత మాట్లాడుతూ కుటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఆంధ్రప్రదేశ్‌లో విధ్వంసం పెరిగిందన్నారు. మహిళలు, చిన్నారులు, బాలికలు, విద్యార్థులపై దాడులు పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. సోషల్ మీడియా కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టి ఇబ్బందులు పెడుతున్నారు. ఇటువంటి దుశ్చర్యలు మానుకుని ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని హితవు పలికారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు గండేపల్లి బాబి, గంగ్రెటి రాము, ఆనాల సుదర్శన్, వెంకటసత్యనారాయణ, గింజల శ్రీను, మోహిద్దీన్, రామయ్య, జ్యోతులు బీముడు, జ్యోతులు చక్రబ్బాయి, రావు మాధవరావు, కొత్తెం దత్తుడు, బండి దావీదు తదితరులు పాల్గొన్నారు.

వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి పూలే కృషి

సామర్లకోట: మహాత్మ జ్యోతిరావు పూలే వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ఎంతో కృషి చేశారని మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, రాష్ట్ర అయ్యారక సంఘ అధ్యక్షుడు ఆవాల లక్ష్మీనారాయణ అన్నారు. జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పూలే ఆశయ సాధనకు యువత ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు రెడ్డి లోవ కుమారి, సేపెని సురేష్, స్వయంభారపు వీరభద్రరావు, నేతల హరిబాబు, బీసీ సంఘ నాయకులు చిట్టమాని శ్రీనివాసరావు, రెడ్డి శ్రీనివాసు, నమ్మి శ్రీనివాసులు పాల్గొన్నారు. అదేవిధంగా మండల పరిషత్తు కార్యాలయంలో ఆయన విగ్రహానికి, తహసీల్దార్ కార్యాలయంలో పూలే చిత్రపటాలకు పూలమాలలు వేసి అధికారులు నివాళులు అర్పించారు.

కొత్తపల్లి మండల అధికారులు

తహసీల్దార్	91542 47464
ఎంపీడీఓ	94401 13090
ఇంజినీర్	99890 78030
ఎలక్ట్రికల్ ఏఈ	94408 12642
హౌసింగ్ ఏఈ	70939 30455
ఈఓపీఆర్డీ	99489 27333
ఉపాధి హామీ పథకం ఏపీఓ	83744 46378
డ్వాక్రా ఏపీఎం	89788 81622
ఎస్సై	94409 00752
సీఐ పిఠాపురం	94407 96523
వ్యవసాయ శాఖ ఏఓ	83310 56594
కొత్తపల్లి పీహెచ్‌సీ డాక్టర్	99890 69546
నాగులపల్లి పీహెచ్‌సీ డాక్టర్	98497 28671
కొమరగిరి పీహెచ్‌సీ డాక్టర్	92466 90633
ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ	89858 28380
ఎంఈఓ	92467 34465
ఐసీడీఎస్ సీడీపీఓ	94408 14692
ఇరిగేషన్ జేఈ	83310 75078